క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్



కలెక్టర్‌ను కలిసి మొక్క అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ హనుమంత రెడ్డి శనివారం కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసన్న కుమార్

మద్దిరాల : మద్దిరాల పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ప్రసన్న కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి తగిన న్యాయం చేసి, సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నర్సింహారావు, ఎస్ఐ ఎం.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ట్రస్ట్ చైర్మన్‌గా డాక్టర్ రామ్మూర్తి యాదవ్



సూర్యాపేట : సూర్యాపేట ఇండియన్ మెడికల్ ట్రస్ట్ చైర్మన్‌గా డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ శనివారం ఎన్నికయ్యారు. రామ్మూర్తి యాదవ్ గత 30 ఏళ్లుగా సూర్యాపేటలో హాస్పిటల్ నెలకొల్పి ఎంతోమంది పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించి మన్నలు పొందుతున్నారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి గిరి దుర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా సేవలు అందించారు. ఈయన నియామకం పట్ల పలువురు మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డికి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి బావ, వెంకేపల్లి గ్రామవాసి సూడి మధుసూదన్‌రెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఈ ఎల్‌ఓసీని ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం హైదరాబాద్‌లో సురేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంత వేలం వాయిదా

తుంగతుర్తి : మండల కేంద్రంలో వారాంతపు సంత వేలంపాటను శనివారం నిర్వహించారు. కానీ వేలంలో సర్కారు పాటకు సమాన ధర రాకపోవడంతో వేలంపాటను వాయిదా వేసినట్లు తహసీల్దార్ దయానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సందీప్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ

నూతనకల్ : సెమ్స్ ఒలింపియాడ్ హైదరాబాద్ వారిచే నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షలో మండల కేంద్రానికి చెందిన నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి అవార్డులు అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకన్న తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెమ్స్ కన్వీనర్ ఆరుకాల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, చతుర్థ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమోంటో, నగదు అందజేసి సత్కరించారు. సైన్స్ విభాగంలో సంకినేని ప్రణీత్‌రావు, నోముల శ్రీనిత, వేల్పుల చరణ్‌లతోపాటు పలువురు విద్యార్థులకు మెమోంటోలు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం యాదగిరి, మతిన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి అవార్డులు అందుకుంటున్న నాగార్జున పాఠశాల విద్యార్థులు

‘ఉపాధి’లో కుంటల తవ్వకం

- చేపల పెంపకం చేపట్టేందుకు వీలుగా కూలీలతో పనులు
- మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పాటు



కుక్కడం గ్రామంలో తీస్తున్న చేపల కుంటలు

మద్దిరాల : ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద గ్రామాలలో చేప పిల్లల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా కూలీలను ఉపయోగించి చెరువులు, కుంటలను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు మద్దిరాల మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

చేప పిల్లల పెంపకానికి చెరువులు, కుంటలు..

చేప పిల్లలను పెంచడానికి వీలుగా 25 మీటర్ల పొడవు, 15 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో ప్రత్యేక కుంటలను తవ్వుతున్నారు. ఈ కుంటల ద్వారా చేప పిల్లల విత్తనోత్పత్తిని చేపట్టి, వాటిని ఆయా గ్రామాలలోని పెద్ద చెరువులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా కుంటల తవ్వకం పనులను ఉపాధి హామీ కూలీలతో చేయిస్తున్నారు.

మద్దిరాల మండలంలో చేపట్టిన పనులు..

మద్దిరాల మండలంలోని మొత్తం 15 గ్రామ పంచాయతీలలో చేప పిల్లల పెంపకానికి కుంటలను సిద్ధం చేస్తున్నారు. ఈ కుంటల తవ్వకానికి ఒక్కోదానికి రూ. 5 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు నిధులు కేటాయిస్తున్నారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, మద్దిరాల గ్రామంలో రెండు కుంటలు, గోరెంట్ల గ్రామంలో రెండు కుంటలు, కుక్కడం గ్రామంలో రెండు కుంటలు, రెడ్డిగూడెం గ్రామంలో రెండు కుంటలు, ముకుందాపురం గ్రామంలో ఒక కుంట, జి.కొత్తపల్లి గ్రామంలో ఒక కుంట, గుమ్మడవెల్లి గ్రామంలో ఒక కుంట, చందుపట్ల గ్రామంలో ఒక కుంట, చిన్ననెమిల గ్రామంలో ఒక కుంట చొప్పున చేప పిల్లల పెంపకానికి కుంటలను సిద్ధం చేస్తున్నారు.

కార్యక్రమం ముఖ్య ఉద్దేశం..

ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం స్థానికంగానే చేప పిల్లలను ఉత్పత్తి చేసి, వాటిని అదే గ్రామాలలోని చెరువులకు పంపిణీ చేయడం. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, చేపల పెంపకం ద్వారా స్థానిక మత్స్యకారులకు, రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. మండల పరిధిలోని చిన్ననెమిల గ్రామంలో చేప పిల్లల నిర్వహణ పనులను గత నెలలో అధికారులు పరిశీలించారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, స్థానిక నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ చేపల ఉత్పత్తిని పెంచడానికి కూడా దోహదపడుతుంది.

నిర్దేశించిన గ్రామాలలో పనులు నిర్వహిస్తున్నాం



ప్రభుత్వం నిర్దేశించిన గ్రామాలలో చేపల పెంపకానికి అవసరమైన కుంటల పనులను చేపడుతున్నాం. దీంతో చేప పిల్లల పెంపకానికి తోడ్పాటు అందించినట్లు అవుతుంది. తద్వారా గ్రామాల్లో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

\- గుండు వెంకన్న, ఏపీఓ, మద్దిరాల

సిబ్బంది సహకారం అభినందనీయం



బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నూతన మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట మున్సిపాలిటీలో సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమని బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌కు వీడ్కోలు, అలాగే నూతన కమిషనర్‌గా బదిలీపై వచ్చిన హనుమంత రెడ్డికి స్వాగత, సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ ఈఈ కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఈ సత్యారావు, జూనియర్ అసిస్టెంట్లు గౌస్, ప్రసాద్, యాదగిరి, సంగు, మాధవి, మెప్మా శ్వేత పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ప్రాచీన దేవాలయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. చివ్వెంల మండలం ఉండ్రుగొండలోని శ్రీలక్ష్మీ సమేత హయగ్రీవ దేవాలయ అభివృద్ధి ప్రచార రథాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చకిలం ఫణికుమార్ మాట్లాడారు. గత కొంత కాలంగా తన సొంత నిధులతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రాచీన ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ కొత్త ఆంజనేయులు, అర్చకులు దరురి రామానుజాచార్యులు, దరురి శ్రీధర్ ఆచార్యులు, భజన మందిరం చైర్మన్ రాచర్ల వెంకటేశ్వర్‌రావు, కాకి మల్లారెడ్డి, లక్కరాజు రమేష్, చారి, బసవయ్య, చకిలం రమాదేవి, కౌసల్య, జయమ్మ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

సూర్యాపేట అర్బన్ : ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. హనుమంత రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 25వ వార్డులో జరిగిన ‘100 రోజుల ప్రత్యేక కార్యాచరణ’ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ ట్రాక్టర్లకు అందించాలని కోరారు. పెంపుడు కుక్కలకు బెల్టులు వేసి, టీకాలు వేయించడం యజమానుల బాధ్యత తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న తాగు నీటి నమూనాలను పరీక్షించినట్లు తెలియజేశారు. నిరుపేద మహిళలకు ఉపాధి కల్పించేందుకు స్వయం సహాయక సంఘాలపై అవగాహన కల్పిస్తున్నామని, చిరు వ్యాపారులకు, దుకాణదారులకు స్ట్రీట్ వెండర్ సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా శిథిలావస్థలో ఉన్న భవనాలలో నివసించేవారు వారిని తక్షణమే ఖాళీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, టీఎంసీ శ్వేత, వార్డు ఆఫీసర్ భరత్, ఆర్‌పీలు నూకల విజయ, వెలుగు వాణి, నాగరాణి, వార్డు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి నవరాత్రోత్సవాలు



సూర్యాపేటలోని సంతోషిమాత ఆలయంలో పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని సంతోషి మాత ఆలయంలో శ్రీ వారాహి మాత నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం ఆలయ అర్చకుడు బట్టారం వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వారాహి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు నూక వెంకటేశ్వం గుప్తా, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు బజ్జూరి శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ సభ్యుడు తొనుకునూరి సంతోష్, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పిల్లలమర్రిలోని ఆలయంలో..

సూర్యాపేట మండలంలోని పిల్లలమర్రి శ్రీ నామేశ్వర ఆలయం ప్రాంగణంలోని శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయంలో శనివారం వారాహి అమ్మవారి నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మునగలేటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పిల్లలమర్రిలోని శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : నాగారం మండల పరిధిలోని పసునూర్ మోడల్‌స్కూల్‌లో పీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్ట్‌ను అవర్లీబేసిక్ పద్ధతిలో బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.చంద్రబాబు తెలిపారు. శనివారం నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలో పీటీజీ ఇంగ్లిష్‌కు సంబంధించి 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో అభ్యర్థులకు పీజీతోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ పత్రాలతో ఈనెల 30న పాఠశాలలో నిర్వహించే డెమోకు హాజరుకావాలని సూచించారు.

3న అలుగుబెల్లి వెంకటనర్సయ్య వర్ధంతి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దిరాల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు అలుగుబెల్లి వెంకటనర్సయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జూలై 3వ తేదీన తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో జరిగే వెంకటనర్సయ్య వర్ధంతి సభలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా కమిటీ సభ్యులు నాగేల్లి రామనర్సయ్య, సృష్టి, గణేష్, లక్ష్మి, వెంకన్న పాల్గొన్నారు.

నాగారం : ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మల పెన్‌పహాడ్‌లో జూలై 3న జరిగే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు అలుగుబెల్లి వెంకటనర్సయ్య స్థూపం ఆవిష్కరణ, వర్ధంతి సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. శనివారం డి.కొత్తపల్లి గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యానాల సుధాకర్‌రెడ్డి, బయ్యం లింగయ్య, ఏశబోయిన లింగయ్య, పడిశాల సంజీవ్, బాషబోయిన రమేష్, లింగమల్లు, అవిలయ్య, మహేష్, నర్సయ్య, ఏసు పాల్గొన్నారు.

నూతనకల్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు అలుగుబెల్లి వెంకటనర్సయ్య 3వ వర్ధంతి సభను జూలై 3న తుమ్మలపెన్‌పహాడ్‌లో నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షు డు కునుకుంట్ల సైదులు, గడ్డం పాపయ్య, పులుసు మహేష్, వీరన్న, దేవేందర్, మహేష్ పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

తాళ్లగడ్డ (సూర్యాపేట) : తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్(టీఎస్‌జేఏ) సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు గుంటి శ్రీనివాస్ నియమితులయ్యారు. శనివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి హాజరై గుంటి శ్రీనివాస్‌కు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు.

రెగ్యులర్‌గా హాజరుకావాలి

ఆత్మకూర్ (ఎస్) : పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు రెగ్యులర్‌గా హాజరుకావాలని జిల్లా విద్యా విభాగం సెక్టోరియల్ అధికారి శ్రవణ్‌కుమార్ సూచించారు. ఆత్మకూర్(ఎస్)లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో బడిబాట ప్రోగ్రామ్ ద్వారా 30 అడ్మిషన్లు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, సమయపాలన, విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలని అన్నారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సఖి కేంద్రం సభ్యులు

నాగారం : మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సూర్యాపేట సఖి కేంద్రం కౌన్సిలర్ శైలజ అన్నారు. శనివారం వర్ధమానుకోట గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి కూలీలను కలిసి సఖి కేంద్రాల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం సఖి కేంద్రాల ద్వారా స్త్రీలకు అండగా నిలుస్తుందన్నారు. గృహహింస, వరకట్నం, పనిచేసే చోట లైంగిక వేధింపులు, ఆడపిల్లల అమ్మకం, ఆడపిల్లల అక్రమ రవాణా తదితర అంశాలలో రక్షణకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవసరమైన వారికి పోలీసుల సేవలు, న్యాయపరమైన సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలియజేశారు. మహిళలకు ఏ కష్టం వచ్చినా హెల్ప్‌లైన్ నంబర్ 181కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్ర సభ్యురాలు పి.భవాని, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను పగలగొట్టడం సమంజసం కాదు

సూర్యాపేటఅర్బన్ : అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పేరుతో సూర్యాపేట పట్టణంలోని వివిధ వార్డులలో ఉన్న సీసీ రోడ్లను పగలగొట్టడం సమంజసం కాదని సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి సాయికుమార్ అన్నారు. శనివారం 7వ వార్డులో నిర్వహించిన సీపీఎం సమావేశంలో మాట్లాడారు. పాలకులకు ముందు చూపు లేకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. సీసీ రోడ్లను పగలగొట్టి మట్టిని పూడ్చకుండా వదిలివేయడంతో వాహనదారులు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పేరుతో పగలగొట్టిన సీసీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి పట్టణ ప్రజల ఇబ్బందులు తీర్చాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి రాచూరి జానకిరాములు, నాయకులు మొగిలి వెంకన్న, మంగయ్య, వెంకటయ్య, సైదమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

మద్దిరాల : మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామ సమీపంలో 365 జాతీయ రహదారిపై శనివారం లారీ బోల్తాపడి డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఖమ్మంకు ఐరన్ లోడ్‌తో లారీ వెళ్తుండగా రెడ్డిగూడెం సమీపంలోని 365 జాతీయ రహదారిపై డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

నెలాఖరు వరకు బియ్యం తీసుకెళ్లాలి



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

అర్వపల్లి : జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని లబ్ధిదారులు ఈనెల 30వరకు తీసుకెళ్లాలని తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ తెలిపారు. కాసర్లపహాడ్‌తోపాటు వివిధ గ్రామాల్లోని రేషన్ దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. సన్నబియ్యం పంపిణీకి ఎలాంటి పొడగింపు ఉండదని, 30వ తేదీ చివరి రోజు అని చెప్పారు. ఆయన వెంట గిర్దావర్‌లు రామరాజు జలేందర్ రావు, పాటి వెంకట్‌రెడ్డి, డీలర్‌లు ఉన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని మహిళా ఆదర్శ సూపర్ బజార్ రేషన్ దుకాణాన్ని ఆర్డీఓ వేణుమాధవ రావు శనివారం తనిఖీ చేశారు. రేషన్ కార్డుదారులకు ఈ నెల 30వరకు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం అందజేస్తున్నట్లు తెలి పారు. రేషన్ కార్డుదారులు ప్రతి ఒక్కరూ బియ్యం తీసుకెళ్లాలని అన్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ దయానందం, నిర్వాహకుడు అంబటి రాములు ఉన్నారు.

పలువురికి ఆర్థికసాయం అందజేత



తిరుమలగిరి : ఆర్థికసాయం అందిస్తున్న దాత



తిరుమలగిరి : తాటిపాములలో..

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో ఇటీవల తల్లిదండ్రులు మృతి చెంది అనాథలుగా మిగిలిన పిల్లలకు శనివారం ఆ గ్రామానికి చెందిన ఈదయ్య ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన పంతం పర్శయ్య–సుభద్ర దంపతులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలు మారారు. పిల్లల దీన పరిస్థితిని చూసి గ్రామానికి చెందిన బత్తుల ఈదయ్య రూ.5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో బొజ్జ శ్రీనివాస్, మల్లయ్య, శ్రీకాంత్, ముత్తయ్య, విజయ్, శ్రీనివాస్, వసంత పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల పరిధిలోని గుండెపురి గ్రామానికి చెందిన కొమ్ము ఈదయ్య ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులకు శనివారం ఇదే గ్రామానికి చెందిన కొమ్ము సోమన్న రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, యాదగిరి, మల్లయ్య, శంకర్, రమేష్, యాకన్న, మహేష్, యాదగిరి పాల్గొన్నారు.



నూతనకల్ : చిల్పకుంట్లలో..

రూ. 30వేల ఆర్థికసాయం..

మండల పరిధిలోని తాటిపాముల గ్రామానికి చెందిన కారుపోతుల ఉమేష్ క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులకు శనివారం స్నేహితులు రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యాకస్వామి, రాజు, అయిలమల్లు, కుమారస్వామి, అనిల్, భాషా, మధు, మురళీ, భిక్షం, నరేష్, ముత్తయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో అర్వపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి నగేష్‌నాయక్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లలిత, ఎల్‌టి. చొక్కయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం మంజుల, ఏఎన్‌ఎంలు సైదమ్మ, శకుంతల, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకలను జయప్రదం చేయాలి

నూతనకల్ : ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జూలై 7న నిర్వహించే వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే జెండా దిమ్మెలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్వాయి బాలయ్య, గంటా భిక్షపతి, పరశురాములు, మిర్యాల చిరంజీవి, లక్ష్మీకాంత్, ఇరుగు వెంకన్న, ముత్తయ్య, పాల్వాయి మహేష్, నకిరేకంటి చిరంజీవి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



దిమ్మె పనులను ప్రారంభిస్తున్న నాయకులు

అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు కొత్తగా 70అడ్మిషన్లు



అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 70 అంకె ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

అర్వపల్లి : ఈ విద్యా సంవత్సరం అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు కొత్తగా 70అడ్మిషన్లు వచ్చాయి. దీంతో శనివారం పాఠశాలలో విద్యార్థులు 70అంకె ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కొత్తగా 70అడ్మిషన్లు చేర్పించినట్లు హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి. మల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈదుమూడికి తరలిరావాలి

సూర్యాపేట : జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుమూడిలో జరిగే మాదిగ అమరుల సంస్మరణ సభకు మాదిగ, అనుబంధ కులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో చలో ఈదుమూడి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం నాయకులు వల్దాస్ ప్రవీణ్, ఊటుకూరి రవీందర్, ఒగ్గు సోమయ్య, పల్లేటి నాగార్జున, కనుకు రవి, మీసాల నాగయ్య, వల్లపట్ల రవి, బొల్లికొండ సతీష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.